'ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలి'

నాంపల్లి: ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, ఇంజనీరింగ్ కళాశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు మహేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాడపంగి నాగరాజు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు మంద నవీన్, కె.శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తమకు మంగళవారం వినతి పత్రం అందజేశారు.

కార్యాలయం ప్రారంభం



గౌలిపురా: లాల్‌దర్వాజాలో పాతనగర మున్నూరు కాపు సంఘం నూతన కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. అనంతరం పాతనగర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన పల్లె శ్రవణ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో పాతనగర మున్నూరు కాపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మడిగల భాస్కర్ రావు, ప్రధాన కార్యదర్శి సుంకరి వేణు, రాష్ట్ర మున్నూరు కాపు మహిళా సంఘం ఉపాధ్యక్షురాలు తిరుపతి పద్మశ్రీ, పాతనగర మున్నూరు కాపు మహిళా సంఘం కన్వీనర్ కాసుల కుసుమ, పాతనగర మున్నూరు కాపు సంఘం సలహాదారులు, పదాధికారులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సంఘాల బలోపేతానికే కమిటీలు



నూతన కమిటీల ప్రతినిధులతో ఎమ్మార్పీఎస్ నాయకులు

చార్మినార్: ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలను మరింత బలోపేతం చేసేందుకే కమిటీలు వేస్తున్నామని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) రాష్ట్ర కోఆర్డినేటర్, జిల్లా ఇన్‌చార్జి ఇజం వెంకట్ స్వామి మాదిగ అన్నారు. బహదూర్‌పురా నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నూతన కమిటీలను పురానాపూల్ వద్ద మంగళవారం ఏర్పాటు చేశారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నాయకులు పదవుల కోసమే కాకుండా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. బహదూర్‌పురా నియోజకవర్గ ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఇన్‌చార్జి సర్వింగ్ రావు ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాలకు డివిజన్ల వారీగా కమిటీలను నియమించారు. కార్యక్రమంలో బీపీ నరసింహారావు మాదిగ పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని వినతి



మంత్రి జూపల్లికి వినతి పత్రం ఇస్తున్న దీపక్ రాజ్ వర్మ

చార్మినార్: పాతబస్తీలో బోనాల ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని మజ్లిస్ ఓబీసీ ఇన్‌చార్జి అడ్వ. దీపక్ రాజ్ వర్మ కోరారు. ఈ మేరకు మంత్రి జూపల్లి కృష్ణారావును మంగళవారం కలిసి ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఇచ్చిన సిఫారసు లేఖను మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం బోనాలకు నిధులను మంజూరు చేసిందని సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో ఎక్కువ ఆటంకాలు లేకుండా భక్తులకు ముందుముందుగానే చేసే ఆటపాటలు కొనసాగించాలన్నారు.

ఎండీలైన్స్, పాత మిలటరీ క్వార్టర్స్‌కు మరమ్మతులు చేపట్టాలి

గోల్కొండ: ఎండీ లైన్స్‌లోని పాత మిలటరీ క్వార్టర్స్‌కు మరమ్మతులు చేపట్టాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ కోరారు. ఈ మేరకు డిఫెన్స్ ఎస్టేట్ ఆఫీసర్ సి.నిరంజన్‌రెడ్డిని మంగళవారం కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్వార్టర్స్ మరమ్మతుల కోసం దివంగత మహనేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలోనే జీఓ 118 జారీ అయిందన్నారు. అయితే క్వార్టర్స్ మరమ్మతులు చేయకుండా అలాగే వదిలేశారన్నారు. దీంతో అందులో ఉంటున్న వారు ఇబ్బంది కుటుంబాలు జీవిస్తున్నారన్నారు. వెంటనే తగు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

న్యాయవాది శివకుమార్ దాస్ మృతి తీరని లోటు

యాకుత్‌పురా: సిటీ సివిల్ కోర్టు సీనియర్ న్యాయవాది, గవర్నమెంట్ మాజీ ప్లీడర్ శివకుమార్ దాస్ అకాల మరణం తీరని లోటని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కో-కన్వీనర్లు ఏ. మాణిక్ ప్రభుగౌడ్, ఎం.ఎస్ తిరుమల్ రావు పేర్కొన్నారు. పురానీహవేలీలోని హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో మంగళవారం వారు మాట్లాడుతూ.. శివకుమార్ తెలంగాణ రాష్ట్ర మలి దశ ఉద్యమంలో తమతో పాటు అనేక పోరాటాల్లో పాల్గొన్నారని గుర్తు చేసుకున్నారు. అలాగే వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బోనాలకు సర్వం సిద్ధం..!

- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు
- తొలి బోనం గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారికి
- ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు
- లంగర్ హౌస్‌లో సమర్పించనున్న మంత్రులు



చోటాబజార్ పూజారి ఇంటి వద్ద (ఫైల్)



గోల్కొండ కోటపై అమ్మవారి ప్రధాన ఆలయం

లంగర్‌హౌస్: తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల ఉత్సవాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. నెల రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే బోనాల ఉత్సవాలు గోల్కొండ కోటలోనే ప్రారంభమై, చివరి బోనాలు కూడా ఇక్కడే ముగించడం ఆచారం. గోల్కొండ కోటపై జగదాంబికా అమ్మవారికి మొదటి పూజ నిర్వహించి నెల రోజులు పాటు ప్రతి గురు, ఆదివారాల్లో 9 పూజలు నిర్వహిస్తారు. శతాబ్దాలుగా లంగర్‌హౌస్ వాసుల చేతుల మీదుగా బోనాలు నిర్వహించడం ఆనవాయితీ వస్తోంది.

ఏర్పాట్లు పూర్తి చేశాం



గోల్కొండ జగదాంబిక మహంకాళి బోనాల జాతరకు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేశాం. లంగర్‌హౌస్ నుంచి గోల్కొండ కోటపై అమ్మవారి ఆలయం వరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నాం. భక్తులు కూడా అధికారులకు సహకరించి అమ్మవారిని దర్శించుకోవాలి.

–కొండిపుడి వంటిబాబు (గోల్కొండ జగదాంబిక మహంకాళి ఆలయ చైర్మన్)

నజర్ బోనం, భారీ తొట్టెలతో బోనాలు

గోల్కొండ జగదాంబిక అమ్మవారికి ప్రథమ పూజతో బోనాల సంబరాలు ప్రారంభమవుతాయి. మొదటి పూజలో భాగంగా నజర్ బోనం సమర్పించనున్నారు. 32 అడుగుల ఎత్తైన భారీ తొట్టెలను కూడా సమర్పించనున్నారు. ఈనెల 25న లంగర్‌హౌస్ చౌరస్తా నుంచి భారీ ఊరేగింపుతో గోల్కొండ కోటకు పట్టు వస్త్రాలు, కల్లు సాక, తొట్టెలు తీసుకెళ్లనున్నారు.

ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు

ప్రభుత్వం తరఫున గమంత్రులు లంగర్‌హౌస్‌లో అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించి ఊరేగింపును ప్రారంభిస్తారు. చోటాబజార్‌లోని ప్రధాన పూజారి ఇంట్లో పూజలు చేసి అక్కడి నుంచి బోనాలతో అమ్మవారి పల్లకీలో ఊరేగింపి కోటపై కొలువుదీరిన అమ్మవారి ఆలయంలో ప్రతిష్ఠించడంతో మొదటి పూజ ముగియనున్నది. అమ్మవారిని నగలతో అలంకరించి, తొలిబోనం సమర్పిస్తారు.

తొలి బోనం విశిష్టత

లంగర్‌హౌస్‌ను గతంలో లంగర్‌ఖానా అని పిలిచేవారు. లంగర్ అనగా వంట ఖానా అనగా గది. ఈ ప్రాంతంలో నాడు వంట గదులు ఉండేవి కావు. ఆనాటి ధాన్యాగారం ఇక్కడి బాండాగార్లో దాని రాజులకు, సైనికులకు ఆహారాన్ని లంగర్‌హౌస్‌లోనే వండి పంపించేవారు. అమ్మవారి నైవేద్యాన్ని కూడా ఇక్కడి నుంచే వండి పంపించడంతో బోనాలను లంగర్‌హౌస్ వాసులు నిర్వహించే ఆనవాయితీ కొనసాగుతోంది.

సామూహిక బోనాల సమర్పణ

మొదటి బోనం తర్వాత భక్తులు లక్షల సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించే రోజుకు మరో ప్రత్యేకత ఉంది. జూలై 6 న సామూహిక బోనాల ఊరేగింపు నిర్వహించనున్నారు. నగరంలోని ప్రధాన దేవాలయాలు అయిన సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి, మిరాలంమండీ అమ్మవారు, లాల్‌దర్వాజ అమ్మవార్లతో పాటు పలు ఆలయాల నుంచి దాదాపు 100కు పైగా తొట్టెలను సామూహిక ఊరేగింపు నిర్వహించనున్నారు. వీరంతా తమ తొట్టెలు, బోనాలను జూలై 10 న ఉదయం 11 గంటలకు లంగర్‌హౌస్‌కు తీసుకురానున్నారు. ఇక్కడి నుంచి సామూహిక ఊరేగింపుగా గోల్కొండ కోటపైకి సాగుతుంది.

అమ్మవారి తొమ్మిది పూజలు

- గురువారం మొదటి బోనం సమర్పించనుండగా ప్రతి ఆది, గురువారాల్లో ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించనున్నారు.
- జూలై 6 న నాలుగో పూజ సందర్భంగా జంట నగరాల్లోని ప్రముఖ ఆలయాల నుంచి లంగర్‌హౌస్‌కు తొట్టెలు ఊరేగింపుగా చేరుకొని, అక్కడ నుంచి గోల్కొండ కోటకు సామూహిక బోనాల ఊరేగింపు నిర్వహించనున్నారు.
- జూలై 10న ఐదో పూజ సందర్భంగా కోటపై అమ్మవారి ఆలయం వద్ద చండీ హోమం నిర్వహిస్తారు.
- 13 న ఆరో పూజను పురస్కరించుకొని శాఖంబరీ ఉత్సవాలు నిర్వహించనున్నారు.
- 17న ఏడో పూజ సందర్భంగా కోటపై అమ్మవారికి పల్లకీ సేవ, మాతాకీ జాగరణ కార్యక్రమాలు ఉంటాయి.
- 24న చివరి పూజ సందర్భంగా అమ్మవారికి సమర్పించాక కుంభార్తి, గావు, పసి వృత్తి వార్తలతో సమాప్తి పూజా కార్యక్రమాలు ఉంటాయి.

పాతబస్తీలో మొహర్రం ఏర్పాట్ల పరిశీలన



రూట్ మ్యాప్ పరిశీలిస్తున్న డీసీపీ, జేహెచ్ఎంసీ జోనల్ కమిషనర్, ఎమ్మెల్యే తదితరులు

చార్మినార్: దక్షిణ మండలం డీసీపీ, జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ తదితర అధికారులు పాతబస్తీలోని దబీర్‌పురాలోని బీబీకా అలావా వద్ద మొహర్రం ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. మొహర్రం సంతాప దినాల ప్రారంభానికి ముందే అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని చార్మినార్, యాకుత్‌పురా ఎమ్మెల్యేలు మీర్ జుల్ఫీకర్ అలీ, మేరాజ్ హుస్సేన్, ఎమ్మెల్సీ రియాజుల్ హసన్ హఫందీ అధికారులకు సూచించారు. అనంతరం మొహర్రం సంతాప దినాల సందర్భంగా వచ్చే నెల 6 న పాతబస్తీ ప్రధాన వీధిలో నిర్వహించే సామూహిక ఊరేగింపు రూట్లు పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ బందోబస్తు నిర్వహించడంతో పాటు పాతబస్తీలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని డీసీపీ స్నేహ మేహ తెలిపారు.

భద్రతా చర్యలు తీసుకోవాలి

మొహర్రం సంతాప దినాలను పురస్కరించుకుని అన్ని అషుర్‌ఖానాల వద్ద అగ్నిమాపక భద్రతా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విపత్తు నివారణ,అగ్నిమాపక సేవల డైరెక్టర్ జనరల్ వై.నాగిరెడ్డిని కోరినట్లు రాష్ట్ర బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తెలిపారు. ఈ మేరకు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి రాసిన లేఖను మంగళవారం ఆయనకు అందజేసినట్లు తెలిపారు. అషుర్‌ఖానాల వద్ద అగ్నిమాపక సిబ్బంది తమ వాహనంతో అందుబాటులో ఉండాలన్నారు. సంతాప దినాలు 68 రోజుల పాటు కొనసాగనున్నందున వలంటీర్లందరికి అవగాహన తరగతులు నిర్వహించాలని కోరినట్లు తెలిపారు. ఇక వచ్చే నెల 6న, నిర్వహించే పదో మొహర్రం బీబీకా ఆలం సామూహిక ఊరేగింపుకు అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరడంతో డీజీ అప్పటికప్పుడు సంబంధిత అగ్నిమాపక అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు.

నూతన క్రీడా పాలసీ ఆమోదంపై హర్షం



సంబరాల్లో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి తదితరులు

గచ్చిబౌలి: తెలంగాణ ప్రభుత్వం నూతన క్రీడా పాలసీని ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేస్తూ తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలో మంగళవారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పటాకులు కాల్చి సీఎం, డిప్యూటీ సీఎం, క్రీడా శాఖ మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ.. క్రీడాకారులకు నగదు ప్రోత్సాహం, గుర్తింపు పొందిన క్రీడా సంఘాలకు నిధుల పెంపు, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారుల మెరుగైన శిక్షణ అవసరమైన సదుపాయాలు ఇచ్చేందుకు స్పష్టమైన విధానాలు పొందుపరిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్రీడా శాఖ అధికారులు, కోచ్‌లు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆశీస్సులతోనే తెలంగాణ సస్యశ్యామలం

గోల్కొండ: ఎల్లమ్మ అమ్మవారి కృప వల్లే తెలంగాణ సస్యశ్యామలంగా ఉందని జోగిని శ్యామలాదేవి అన్నారు. ఈనెల 26న గోల్కొండ కోట రిసాలబజార్‌లో జరిగే బోనాల జాతరకు హాజరుకావాలని కోరుతూ వృత్తిపని బోనాల సంఘం మాజీ అధ్యక్షుడు బి.సాయిబాబాచారి మంగళవారం ఆమెకు ఆహ్వాన పత్రం అందజేశారు. కరిగిన వారిలో అమ్మవారి వృత్తి పని సంఘం ఉపాధ్యక్షుడు బి.శ్రీకాంత్‌చారి, మహంకాళి ఆలయ పూజారి బి.సురేశ్‌చారి, శివచారి తదితరులు ఉన్నారు.



జోగిని శ్యామలాదేవికి ఆహ్వాన పత్రం ఇస్తున్న దృశ్యం

బీజేపీ హయాంలోనే అన్ని వర్గాల అభివృద్ధి



మోదీ సంక్షేమ పాలనను వివరిస్తున్న బీజేపీ నాయకులు

జియాగూడ: బీజేపీ హయాంలోనే అన్ని వర్గాలు అభివృద్ధి చెందాయని జియాగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు జగదీశ్ యాదవ్ అన్నారు. జియాగూడ నవోదయనగర్‌లో 11 ఏళ్లలో ప్రధాని నరేంద్రమోదీ పాలన చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను సోమవారం సాయంత్రం బస్తీల్లో తిరుగుతూ వివరించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు దర్శిల్లి నర్సిములు, సుదర్శన్ ముదిరాజ్, రమేశ్ బొత్తే, తులసీదాస్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

అఫ్జల్‌గంజ్: తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఉస్మానియా జనరల్ ఆసుపత్రి శాఖ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాబర్ట్ బ్రూస్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు హనుమంతరావు, కార్యదర్శి ఎండీ పాషాలో నూతన కార్యవర్గ సభ్యులను ఆసుపత్రి సూపరింటెండెంట్ మంగళవారం పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన వారికి అభినందనలు తెలిపారు. నూతన కార్యవర్గం కార్యదర్శిగా బుర్రా రవికుమార్, సహాయ కార్యదర్శులుగా జి.బాబు, కె.నర్సింగ్‌రావు, కార్యవర్గ సభ్యులుగా స్వప్న, పద్మిని, స్వరూప, వనిత, సావిత్రి ఎన్నికయ్యారు.



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్ సహాయ్

బోనాలను వైభవంగా నిర్వహిస్తాం



రాఘవేంద్రను సత్కరిస్తున్న ఎర్రని కైలాష్ గంగపుత్ర

గౌలిపురా: ఆషాఢ మాసం బోనాలను వైభవంగా నిర్వహిస్తామని ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేంద్ర అన్నారు. గౌలిపురా మహంకాళి మాతేశ్వరి భారతమాతా ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్రని కైలాష్, గంగపుత్ర ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సలహాదారులు ఎస్.మల్లేశం గౌడ్, కె.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మాజీ కార్పొరేటర్ పాశం సురేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ఎస్.ఆనంద్ రావు, ఉపాధ్యక్షులు ఆలె భాస్కర్ రాజ్, ఎం.ప్రకాశ్, కె.ప్రకాశ్ రాజ్, బి.వై.శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి అల్లి మధుసూదన్ గిరి, కోశాధికారి బొడ్డు సాయిబాబా, వై.రాజు, దల్లు శివ, జి.రమేశ్, పి.శంకర్, కె.శ్రీకాంత్, జమాల్‌పూర్ అశోక్, రమన్‌రాజ్, ఎ.సాయి కిరణ్, వై.భరత్, ఎం.వినోద్, ఎం.విక్రమ్, చందు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలతో జీవితం నాశనం

చాంద్రాయణగుట్ట: విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని చాంద్రాయణగుట్ట ఏసీపీ సుధాకర్ సూచించారు. చాంద్రాయణగుట్టలోని ప్రభుత్వోన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు యాంటీ డ్రగ్స్, సైబర్ క్రైం నేరాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు జాగ్రత్తలు సూచించి సలహాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్.నారాయణ, విజిలెన్స్ డైరెక్టర్ వి.శ్రీను, అధ్యాపకులు సునీత, శ్రీనివాస్, సాయిబాబా, చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్ గోపి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ సుధాకర్

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

సంతోష్‌నగర్: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సంతోష్‌నగర్ డివిజన్ ఏసీపీ బాకూర్ సుఖదేవ్ సింగ్ అన్నారు. సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని యూనిక్ స్కూల్‌లో యాంటీ డ్రగ్స్‌పై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాదకద్రవ్యాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ, డీఐ జగన్ రెడ్డి, ఎస్సైలు రవి, నస్రీన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

నగర టీఎన్జీజీ ఉపాధ్యక్షురాలిగా బిట్ల సుజాత



సుజాతకు నియామక పత్రం ఇస్తున్న శ్రీనివాస్, రాజకుమార్, విక్రంకుమార్

అబిడ్స్: టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షురాలుగా బిట్ల సుజాతను నియమిస్తూ టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌కుమార్, కార్యదర్శి కుర్రాడి శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్. రాజకుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు మంగళవారం ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన యూనియన్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమానికి వారి ప్రగతికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

రెజ్లింగ్‌లో ప్రతిభ

సుల్తాన్‌బజార్: శ్రీరామ్ కేసరి 5వ జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలు కర్నూలులో జరిగాయి. 17 రాష్ట్రాలకు చెందిన రెజ్లర్స్ పాల్గొన్నారు. తెలంగాణకు చెందిన రెజ్లర్ శివమూల యశ్వంత్‌కుమార్ మొదటి స్థానంలో నిలిచారు. పద్మశ్రీ మంద‌కృష్ణ మాదిగను ఆయన నివాసంలో మంగళవారం కలిసి ఆశీర్వచనలు పొందారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఈటు.దర్శన్ మాదిగ, జాతీయస్థాయి వాలీబాల్ ఆటగాడు బి.అవినాష్, గణేశ్, రాష్ట్రస్థాయి రెజ్లర్ మంద‌కృష్ణ మాదిగ ఆశీర్వాదం పొందారు.



యశ్వంత్‌కుమార్‌ను సత్కరిస్తున్న మందకృష్ణ మాదిగ

రేపు జాబ్‌మేళా

విజయనగర్‌కాలనీ: హైదరాబాద్ జిల్లా ఉపాధికల్పన కార్యాలయంలో ఈనెల 26న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి అధికారి అసర్షఫర్ వందన మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని ప్రముఖ ప్రైవేట్ సంస్థల్లో టెలికాలర్ తదితర 50 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. ఇంటర్, డిప్లొమా, బీఎస్సీ, బీకాం, కంప్యూటర్ సైన్స్ విద్యార్హతతో పాటు 18 ఏళ్లు పైబడిన వారు అర్హులు. ఎంపికైన వారికి విద్యార్హత, అనుభవాన్ని అనుసరించి ఆకర్షణీయమైన జీతభత్యాలు ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హత గల వారు ఉదయం 11 గంటలకు విజయనగర్ కాలనీలోని హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో పోటోలు సర్టిఫికెట్లతో హాజరు కావాలని మరిన్ని వివరాలకు 8328428933 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నిరుద్యోగ యువతకు ఉచితంగా డేటా ఇంజనీరింగ్ కోర్సు శిక్షణ

అబిడ్స్: సత్యసాయి సేవా సంస్థ, సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా నిరుద్యోగ యువతకు ఉచిత డేటా ఇంజనీరింగ్ కోర్సు శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022–2025 మధ్య బీఎస్సీ, ఎంఎస్సీ, బీటెక్, ఎంటెక్, లేదా ఎంసీఏ పూర్తిచేసిన వ్యక్తులు అర్హులని, ఎంపికైన అభ్యర్థులకు పైథాన్, అడ్వాన్స్‌డ్ పైథాన్, ఎస్.క్యూఎల్, బీఐ టూల్స్‌తో పాటు సాఫ్ట్ స్కిల్స్‌లో 90 రోజుల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని సత్యసాయి స్కిల్ సెంటర్‌లో ఆఫ్‌లైన్ తరగతులు ఉంటాయని తెలిపారు. కోర్సు పూర్తయిన తర్వాత ప్లేస్‌మెంట్ కూడా ఉంటుందని, మరిన్ని వివరాలకు 90523 72023 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

27 నుంచి పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సులు

గోల్కొండ: మెహిదీపట్నం పరిసర ప్రాంతాల నుంచి పుణ్యక్షేత్రాలకు వెళ్లేవారికి ప్రత్యేక ప్యాకేజీ ఆర్టీసీ ప్రారంభించిందని మెహిదీపట్నం డిపో మేనేజర్ బి.వి.కృష్ణమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27న మెహిదీపట్నం డిపో నుంచి ప్రత్యేక బస్సు ఉదయం 5 గంటలకు ములుగు జిల్లా రామప్ప దేవాలయం, ములుగు కోట గుళ్లు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా, వెయ్యి స్తంభాల గుడి వరంగల్ జిల్లా, భద్రకాళి ఆలయానికి బయలుదేరుతుందని పేర్కొన్నారు. టికెట్ పెద్దలకు రూ.1050, పిల్లలకు రూ.650 ఉంటుందని తెలిపారు. ఇది కేవలం టికెట్ రేట్ మాత్రమే అని ఆలయ దర్శన టికెట్లు, టీ, టిఫిన్, భోజన ఖర్చులు ప్రయాణికులే చెల్లించుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఒకే కాలనీ నుంచి 35–40 ప్రయాణికులు ఉంటే బస్సు నేరుగా కాలనీకే వస్తుందని, మరిన్ని వివరాలకు 9959226133, 8493345129, 7075050005 లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

చాంద్రాయణగుట్ట: జంగమ్మెట్‌లోని మా హెల్త్ హోమ్‌లో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. దాదాపు 150 మంది రోగులకు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. శిబిరంలో ఎన్‌పీ హెచ్ డాక్టర్ అనితా, డాక్టర్ షరీయుల్లా బేగ్, డాక్టర్ శృతి, డాక్టర్ శరణ్య, చార్మినార్, అలియాబాద్ యూపీహెచ్‌సీల వైద్య సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఫార్మాసిస్టులు పాల్గొన్నారు.

బోనాలకు పకడ్బందీ బందోబస్తు ఏర్పాట్లు చేయాలి

చార్మినార్: బోనాలకు ఆలయాల వద్ద అదనపు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేయాలని భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గోపిశెట్టి రాఘవేందర్ కోరారు. ఈ మేరకు కమిటీ ప్రతినిధులతో కలిసి పురానీహవేలీలోని డీసీపీని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు.

రౌడీషీటర్‌కు జైలు



రషీద్

గౌలిపురా: రాడ్‌తో అనుమానాస్పదంగా రౌడీషీటర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తలాబ్‌కట్ట ప్రాంతానికి చెందిన రషీద్ (30) రౌడీషీటర్. రాడ్‌తో అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు రషీద్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. మంగళవారం కోర్టులో హాజరుపర్చగా పూర్వ పరాలు పరిశీలించిన ఇన్‌చార్జి 4వ స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సత్యనారాయణ నిందితుడికి 15 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించండి



మంత్రి వాకిటి శ్రీహరితో డాక్టర్ మెట్టు శ్రీకాంత్

అబిడ్స్: మత్స్యకారుల సంక్షేమానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ స్టార్ యువజన నాయకుడు డాక్టర్ మెట్టు శ్రీకాంత్ కోరారు. ఈమేరకు పశు సంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరిని మంగళవారం కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా మెట్టు శ్రీకాంత్ మాట్లాడుతూ.. మత్స్యకారులు పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని అన్ని జిల్లాల్లోని మత్స్యకారులకు ఉచితంగా చేపపిల్లలను ఇచ్చి అభివృద్ధికి దోహద పడాలన్నారు.

మర్యాదపూర్వక కలయిక



గోల్కొండ: గుడి మల్కాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు దేవర వంశీ హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు తన జీవిత చరిత్రపై రాసిన 'ప్రజల కథే నా ఆత్మ కథ' అనే పుస్తకాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ.. ప్రతికక్షకి జీవితంలో ఒడిదుడుకులు సహజమేనని, వాటిని అధిగమించిన వారే ఉన్నత లక్ష్యాలు చేరుకుంటారని పేర్కొన్నారు.